క్లుప్తంగా

బడిబాటను సద్వినియోగం చేసుకోండి

నందిగామ: నేటి నుంచి నిర్వహించనున్న బడి బాట కార్యక్రమాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కృష్ణా రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బడీడు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో బడిలోనే ఉండాలని, ఈ మేరకు నేటి నుంచి వారంరోజుల పాటు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. 5 ఏళ్లలోపు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లోకి, 5 ఏళ్లు పైబడిన పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు.

ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన పబ్బే లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5వేలు, గ్రామస్తులు రూ.2,500ల ఆర్థికసాయం దశదినకర్మల నిమిత్తం కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రమేశ్, చంద్రారెడ్డి, ముత్యాలురెడ్డి, శ్రీనివాసులు, రాజు, చంద్రయ్య, వెంకటయ్య, మహేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి

ఎంపీడీఓ సుమతి

నందిగామ: వర్షాకాలం ప్రారంభమవుతున్న ప్రస్తుత తరుణంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ సుమతి గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రమైన నందిగామలో బుధవారం గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా మురికికాల్వలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తూ పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా హరితహారం కార్యక్రమంలో భాగంగా గతంలో నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని, మళ్లీ మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, కార్యదర్శులు జానకీరాం, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుల నిర్మూలనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో బాలకార్మికుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. బుధవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో పోలీస్, విద్యాశాఖ అధికారులతో బడిబాట కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పాఠశాలకు వెళ్లకుండా బయట తిరిగే, కూలీ పనులకు వెళ్లే బాలకార్మికులను వెంటనే గుర్తించి బడిలో చేర్పించే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో వీఓ, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు, ఇతరులను కలుపుకొని కమిటీలను రూపొందించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సంపూర్ణంగా వాడుకొని, అవసరమైన సదుపాయాలను కల్పించాలని కోరారు. సమావేశంలో మోకిల ఠాణా ఇన్‌స్పెక్టర్ వీరబాబు, శంకర్‌పల్లి ఠాణా ఎస్సై సత్యనారాయణ, ఐసీడీఎస్, హాస్టల్ వార్డెన్స్ పాల్గొన్నారు.

మల్లురవికి శుభాకాంక్షలు

కడ్తాల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన డాక్టర్ మల్లురవిని మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లురవికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు లక్ష్మినాయక్, జహంగీర్ అలీ, ఆనంద్ తదితరులు ఉన్నారు.

తొలకరి పులకింత



- ఖరీఫ్ సాగుకు సమాయత్తం
- పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు

మరియాపురంలో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళ కూలీలు



మరియాపురంలో కురుస్తున్న వర్షం

షాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది వేసవిలో అకాల వర్షాలు పడడంతో రైతులు ముందుగానే దుక్కులు దున్నుకొని సాగుకు సిద్ధంగా ఉన్నారు. మరికొందరు రైతులు చెరువుమట్టి, పశువులు, కోడి ఎరువు చేలకు తోలుకొని పంటల సాగుకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా రోహిణీ కార్తెలో సోమవారం, బుధవారం వర్షం కురవడంతో రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. కొందరు పొడి దుక్కిలోనే పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేయగా తొలకరి వానలు కురవడంతో షాబాద్ మండలం మరియాపూరం, అంతారం, కుర్వగూడ, కేసారం, బోడంపహాడ్ గ్రామాల్లో పత్తి విత్తనాలు నాటుతున్నారు. రోహిణీ కార్తెలో విత్తనాలు నాటితే మంచి దిగుబడి వస్తుందని రైతులు సాగుబాట పట్టారు.

రాష్ట్రంలో బీజేపీకే భవిష్యత్తు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



డీకే అరుణను సన్మానించిన నాయకులు

షాద్‌నగర్: భవిష్యత్‌లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీగా విజయం సాధించిన డీకే అరుణను బుధవారం హైదరాబాద్‌లో గల ఆమె నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యల ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ అరుణకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీతోనే పాలమూరు ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో ప్రజలు డీకే అరుణకు పట్టం కట్టారన్నారు. రామరాజ్యం కోసం పాలమూరు ప్రజలు అరుణమ్మకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కేంద్రంలో డీకే అరుణ కీలక పాత్ర పోషించడం ఖాయమన్నారు. భవిష్యత్‌లో తెలంగాణలో కూడా బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో గతంలో కంటే బీజేపీ ఎంతో పుంజుకుందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, అశోక్, రఘురాం, చెన్నయ్య, రాము, శ్రవణ్, రమేశ్, సందీప్, బాల్‌రాజ్, జగన్, కోస్గి మల్లేశ్, వెంకటేశ్, వివేక్, శ్యాంసుందర్, వినోద్, శ్రీను, సుబ్రమణ్యం, రఘు, యుగేందర్, శ్రీశైలం, గోపాల్‌నాయక్, సాయి గణేశ్, మల్లేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి సన్మానం



షాద్‌నగర్: ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

షాద్‌నగర్: స్థానిక సంస్థల మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిని బుధవారం న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మొదళ్లగూడలో నవీన్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో న్యాయమే గెలిచిందన్నారు. ప్రత్యర్థి పార్టీ నేతలు ప్రజాప్రతినిధులను ఎన్నో ప్రలోభాలకు గురిచేసినా చివరికి న్యాయం నవీన్‌రెడ్డివైపు నిలిచిందని పేర్కొన్నారు. షాద్‌నగర్ ప్రాంత అభివృద్ధికి తగిన విధంగా కృషి చేయాలని కోరారు. సమస్యలపై మండలిలో గళాన్ని గట్టిగా వినిపించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలను కాపాడుకుంటాం

నందిగామ: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీతో పాటు తాను ఆదుకుంటానని, ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి పనిచేయాలని స్థానిక సంస్థల మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి నవీన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలలో ఓటమి చెందినందున అధైర్యపడొద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అని చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తాండ్ర గోపాల్‌రెడ్డి, మాడుగుల విక్రంశర్మ, గడ్డల యాదయ్య, గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌గౌడ్ ఉన్నారు.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు

కేశంపేట: గ్రామస్తులందరి సహకారంతో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో పచ్చదనం, పారిశుద్ధ్యంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 12 వరకు గ్రామాల్లో పచ్చదనం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండలంలో ఎన్ఆర్ఈజీఎస్, హార్టికల్చర్ ప్లాంటేషన్ కోసం 50 ఎకరాలను లక్ష్యంగా నిర్దేశించామన్నారు. మండలంలో హరితహారం కోసం 1 లక్ష 70 వేల మొక్కలను సిద్ధంగా ఉంచినట్లు ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీలకు హరితహారం మొక్కల బాధ్యత అప్పగించామన్నారు. అదే విధంగా గ్రామాల్లో తాగునీరు, శానిటేషన్, గ్రామ పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, నర్సరీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింలు, ఏపీఓ అజీజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బీఆర్ఎస్ నాయకుడు హరికృష్ణగౌడ్



రక్తదానం చేస్తున్న గంగపురం మల్లేశ్

షాద్‌నగర్‌రూరల్: ఆపద సమయంలో మనం చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరికృష్ణగౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామానికి చెందిన పోలె సాయిబాబ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స నిమిత్తం సాయిబాబకు బీ-పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు తెలియజేశారు. బుధవారం బాధితుడి కుటుంబ సభ్యుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన హరికృష్ణగౌడ్, గంగపురం మల్లేశ్, ఆంజనేయులు, యాదయ్య ఆసుపత్రికి చేరుకొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణగౌడ్ మాట్లాడుతూ.. ప్రతినిత్యం ఎంతో మంది అత్యవసర సమయంలో రక్తం దొరకకపోవడంతో తమ ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రసీదులు తప్పనిసరి

మండల వ్యవసాయాధికారి రాజు



విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి రాజు

తలకొండపల్లి: విత్తన దుకాణాల యజమానులు విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి రాజు అన్నారు. మండల కేంద్రంలోని జైకిసాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, వెల్జాల్ గ్రామంలోని న్యూస్వామి ట్రేడర్స్, ఓం సాయి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, తదితర విత్తన, ఎరువుల దుకాణాలను ఏఓ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ ధరల పట్టిక, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, ఈ-పాస్ మిషన్ పనితీరు, అమ్మకాల వివరాలు, ధరల వివరాలను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయించితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత కలిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. నిబంధనలు పాటించని దుకాణ యజమానులపై చర్యలు ఉంటాయన్నారు. పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



శంకర్‌పల్లి: ప్రగతిరిసార్ట్స్‌లో మొక్క నాటి, నీరు పోస్తున్న ఎండీ జీబీకేరావు

షాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ పౌరుడు విధిగా మొక్కలను నాటి సంరక్షించాలని లక్ష్మరావుగూడ మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిధిలోని లక్ష్మరావుగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. రానున్న భావితరాల కోసం మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలతోనే మానవాళి మనుగడ అని గుర్తించుకోవాలన్నారు. విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటిని సరంక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. చెట్లు లేకుంటే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని, దీంతో మానవజీవన ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

చెట్లను విరివిగా పెంచాలి



శంకర్‌పల్లిలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ వెంకయ్య, ఎంపీఓ గీత

శంకర్‌పల్లి: అవకాశం ఉన్న ప్రతిచోట మొక్కలను విరివిగా నాటాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. శంకర్‌పల్లిలో బుధవారం ఆయన మొక్క నాటి నీరు పోశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో మొక్కలు నాటా లని ఆయన అధికారులను ఆదేశించారు. అదే విధంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ నెల 5 నుంచి 12వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలను నిర్మించాలని, తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించి, సేంద్రియ ఎరువులు తయారుచేయాలన్నారు. ఖాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. పల్లె ప్రకృతి వనాల్లో, వేరేచోట్ల చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలునాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, ఏపీఓ నాగభూషణం పాల్గొన్నారు.

ప్రపంచం ప్రమాదంలో పడుతుంది



షాబాద్: పాఠశాలలో మొక్క నాటుతున్న మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు

అభివృద్ధి పేరుతో చెట్లను విపరీతంగా నరకడంతో ప్రపంచం ప్రమాదంలో పడుతుందని ప్రగతి రిసార్ట్స్ ఎండీ జీబీకేరావు అభిప్రాయపడ్డారు. బుధవారం మండలంలోని ప్రొద్దటూరులో గల ప్రగతి రిసార్ట్స్‌లో ఎండీ మొక్కను నాటి, నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకంపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించి, పెద్ద ఎత్తున మొక్కలను నాటే ప్రయత్నం చేయాలన్నారు. ప్రస్తుతం ప్రపంచం గ్లోబల్ వార్మింగ్‌తో ఇబ్బంది పడుతోందని, దీంతో మానవాళి మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ అజయ్‌చంద్ర, డైరెక్టర్ రామకృష్ణ, ఏపీపీ వేణుగోపాల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'అన్నివర్గాల మద్దతు బీజేపీకే'

చేవెళ్ల: అన్నివర్గాల ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీ తో విజయం సాధించటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న మోదీ బీజేపీని తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూడా అధిక ఎంపీ సీట్లు గెలిచాయని చెప్పారు. బీజేపీ బలోపేతమవుతుందని ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయంతో అధికారంలోకి రాబోతుందన్నారు. బీజేపీపై ఎన్నో అసత్య ప్రచారాలు చేసి ప్రజలను బీజేపీ నుంచి దూరం చేసేందుకు చేసిన ప్రయత్నాలను ప్రజలే తిప్పకొట్టారన్నారు. ఇక రాబోయే రోజులు బీజేపీవేనని స్థానిక సంస్థలలో కూడా రాష్ట్రంలోనే బీజేపీ పట్టు నిలుపుకుటుందని చెప్పారు. మండలంలోని కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనవంతు కృషిని అందిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానకి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



అంగన్‌వాడీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం అనే నినాదంతో గ్రామ పంచాయతీ వద్ద బుధవారం ప్రతిజ్ఞ చేశారు. హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, కేతిరెడ్డిపల్లి, ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి, రంజిత్‌కుమార్‌లు మాట్లాడుతూ.. ప్రకృతి వినాశనంతో మానవుడికి ఎంతో కీడు ఉందన్నారు. మానవ మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, కవిత, పంచాయతీ సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



మొయినాబాద్‌లో ఇళ్ల ముందు రోడ్డుపై పారుతున్న మురుగునీరు



మొయినాబాద్‌లో రోడ్డుపక్కన వేసిన చెత్తాచెదారం

మొయినాబాద్: మండల కేంద్రంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. మరో పక్క రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం వేస్తుండడంతో దుర్వాసన, ఈగలు, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఇటీవల కొత్త కాలనీలు విస్తరించాయి. స్టార్ కాలనీ, గుల్షన్ కాలనీ, భరద్వాజ్ కాలనీ, లక్ష్మిగణపతినగర్ తదితర కాలనీల్లో మురుగు కాల్వలు సరిగాలేవు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆయా కాలనీల్లో రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. మరోవైపు చెత్త సేకరణ సరిగాలేకపోవడంతో ఇళ్లలోని చెత్తనంతా రోడ్లపక్కన, ఖాళీ ప్లాట్లలో పడేస్తున్నారు. దీంతో రోగాలు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టడం లేదని.. ఎన్నోసార్లు అధికారులకు చెప్పినా తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటినా అధికారులు స్పందించి పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.